www.varadhinews.com
11
ఆదివారం,
27.10.2024
విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
BUSINESS బిజినెస్

# ఐడిబిఐకి రూ.1,836 కోట్ల లాభాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202425) జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ఐడిబిఐ బ్యాంక్ నికర లాభాలు 39 శాతం పెరిగి రూ.1,836 కోట్లకు చేరాయి. వడ్డీ ఆదాయంలో మెరుగుదల ఆర్థిక ఫలితాలకు ప్రధాన మద్దతును అందించాయి. ఎల్ఐసి ఆధ్వర్యంలోని ఈ బ్యాంక్ గతేడాది రూ.1,323 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.6,924 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ2లో రూ.8,754 కోట్లకు పెరిగింది. ఐడిబిఐ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 3,875 కోట్లకు పెరిగింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 4.90 శాతం నుంచి 3.68 శాతానికి తగ్గాయి. ఏడాది క్రితం 0.39 శాతంగా ఉన్న నికర ఎన్‌పిఎలు.. గడిచిన సెప్టెంబర్ ముగింపు నాటికి 0.20 శాతానికి పరిమితమయ్యాయి. ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. 202425 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 23 శాతం వృద్ధితో రూ.5,238 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో వడ్డీ ఆదాయం రూ.30,263 కోట్లకు చేరింది. ఏడాదికేడాదితో పోల్చితే స్థూల నిరర్థక ఆస్తులు 3.32 శాతం నుంచి 2.50 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పిఎలు 0.76 శాతం నుంచి 0.60 శాతానికి పరిమితమయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ నికర లాభాలు 10 శాతం తగ్గి రూ.45 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.50 కోట్ల లాభాలు ప్రకటించింది. అదే సమయంలో రూ.6387 కోట్లుగా ఉన్న డిపాజిట్లు.. గడిచిన క్యూ2లో 38.6 శాతం పెరిగి రూ.8851 కోట్లుగా చోటు చేసుకున్నాయి.


# భళా బిఎస్ఎన్ఎల్..

కొత్తగా 55 లక్షల పైగా ఖాతాదారుల చేరిక

ప్రభుత్వ రంగ టెల్కో బిఎస్ఎన్ఎల్‌కు ఆదరణ భారీగా పెరుగుతోంది. ప్రయివేటు టెల్కోలు అడ్డగోలుగా పెంచిన టారీఫ్‌లను వినియోగదారులు భరించలేక.. బిఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారు. కొత్త ఖాతాదారులు లక్షల్లో వచ్చి చేరుతున్నారు. కేవలం రెండు నెలల్లోనే బిఎస్ఎన్ఎల్‌లో కొత్తగా 55 లక్షల మంది పైగా చేరారు. ఇదే సమయంలో ప్రయివేటు టెల్కోలు ఏకంగా 1.21 కోట్ల ఖాతాదారులను పోగొట్టుకున్నాయి. టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ శుక్రవారం వెల్లడిరచిన గణంకాల ప్రకారం.. ఈ ఏడాది ఆగస్టులో బిఎస్ఎన్‌లో కొత్తగా 25.3 లక్షల మంది వినియోగదారులు చేరారు. ఇంతక్రితం నెల జులైలోనూ 29.3 లక్షల మంది కొత్తగా వచ్చారు. రిలయన్స్ జియో జులైలో తొలుత భారీగా టారీఫ్‌లను పెంచడం.. ఆ బాటలోనే భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు 25 శాతం వరకు టారీఫ్‌లను పెంచేశాయి. దీంతో ఆ భారాన్ని భరించలేక అనేక మంది బిఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్న విషయం తెలిసిందే. గడిచిన ఆగస్ట్ నెలలో జియో, ఎయిర్‌టెల్, విఐలు ఏకంగా 83 లక్షల మంది ఖాతాదారులను పోగొట్టుకున్నాయి. ఒక్క నెలలోనే రిలయన్స్ జియోను ఏకంగా 40.2 లక్షల మంది వదులుకున్నారు. భారతీ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌కు 24.1 లక్షల మంది గుడ్‌బై చెప్పగా.. విఐ 18.7 లక్షల మందిని కోల్పోయింది. ఇంతక్రితం జులైలోనూ ఈ మూడు టెల్కోలకు 38.6 లక్షల మంది ఖాతాదారులు గుడ్‌బై చెప్పారు. ప్రయివేటు టెల్కోలు ఉచిత కాల్స్ పేరుతో తొలుత స్వల్ప ఛార్జీలతో మార్కెట్లోకి వచ్చి.. కాలక్రమేణ అమాంతం పెంచేశాయి. కాగా.. బిఎస్ఎన్ఎల్ మాత్రం ఇటీవల తన ఖాతాదారులకు బలమైన హామీ ఇచ్చింది. తమ సంస్థ భవిష్యత్తులో టారీఫ్‌లను పెంచే యోచనలో లేదని ఇటీవల నూతన లోగో ఆవిష్కరణ సమయంలో స్పష్టం చేసింది. దీంతో ప్రయివేటు టెల్కోల్లో మరింత గుబులు మొదలయ్యిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బిఎస్ఎన్ఎల్‌కు ప్రయివేటు టెల్కోల ఖాతాదారుల వలస మరింత కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు.




# గౌతమ్ అదానీకి కెన్యా హైకోర్టు షాక్..




పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి చెందిన అదానీ ఎనర్జీ సొల్యూషన్స్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. 736 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ. 6,185 కోట్ల విలువైన ప్రభుత్వ కంపెనీతో ఆయన పవర్ సెక్టార్ కంపెనీ డీల్‌ను హైకోర్టు సస్పెండ్ చేసింది. ఈ ఒప్పందం ప్రకారం అదానీ గ్రూప్ కంపెనీ పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యంలో పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ట్రాన్స్‌మిషన్ లైన్‌లను సిద్ధం చేయబోతోంది. ఈ కేసు కెన్యాకు చెందినది. ఈ ఒప్పందాన్ని హైకోర్టు శుక్రవారం సస్పెండ్ చేసింది. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ఈ నెల ప్రారంభంలో కెన్యా ప్రభుత్వ సంస్థ కెన్యా ఎలక్ట్రికల్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ (కెట్రాకో)తో ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందానికి సంబంధించి, కెన్యా విద్యుత్ మంత్రిత్వ శాఖ అక్టోబర్ 11 న ఇది అక్కడి ఆర్థిక వృద్ధికి సహాయపడుతుందని పేర్కొంది. దేశంలో తరచుగా ఏర్పడే బ్లాక్‌అవుట్‌లను ఎదుర్కోవడంలో కూడా ఇది సహాయపడుతుంది. 'లా సొసైటీ ఆఫ్ కెన్యా' దాఖలు చేసిన కేసుపై తీర్పు ఇచ్చే వరకు ప్రభుత్వం అదానీ ఎనర్జీ సొల్యూషన్స్‌తో 30 ఏళ్ల ఒప్పందం కుదుర్చుకోదని కెన్యా హైకోర్టు ఆ ఒప్పందాన్ని నిలిపివేసింది. కెన్యా యొక్క లా సొసైటీ స్వయంగా ఈ ఒప్పందాన్ని వ్యతిరేకించింది. ఈ అధికార ఒప్పందం రాజ్యాంగ ద్రోహమని కెన్యాలోని లా సొసైటీ పేర్కొంది. అలాగే ఇందులో చాలా గోప్యత ఉంటుంది. ఇది మాత్రమే కాదు, ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి కాట్రాకో, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రజలతో ప్రజల భాగస్వామ్యాన్ని నిర్వహించలేదని కూడా తన దావాలో పేర్కొంది. కెన్యా పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ యాక్ట్ 2021 ప్రకారం అలా చేయడం తప్పనిసరి. ఈ ఒప్పందానికి ముందు, కెన్యా ఇంధన మంత్రిత్వ శాఖ దీని కోసం పోటీ బిడ్డింగ్ ప్రక్రియను అనుసరించినట్లు తెలిపింది. అయితే దీనికి సంబంధించి అదానీ గ్రూప్ నుంచి ఇంకా ఎలాంటి ప్రకటన రాలేదు.

# కొత్త శిఖరాలకు భారత విమానయాన రంగం!



దేశంలోని విమానాశ్రయ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు ఉద్యోగాల కల్పనను పెంచడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఐదేళ్లలో 50 అదనపు విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు గురువారం (అక్టోబర్ 24) ప్రకటించారు. వచ్చే ఐదేళ్లలో 50 కొత్త విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పిస్తోందని చెప్పారు. రానున్న 20 ఏళ్లలో ఈ సంఖ్య 200 అదనపు విమానాశ్రయాలకు పెరుగుతుందని అంచనా వేశారు. రాబోయే కాలంలో 50 అదనపు విమానాశ్రయాలను నిర్మించాలని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. విమానాశ్రయ కనెక్టివిటీని మెరుగుపరచడంతో పాటు, ఈ నిర్ణయం ఉపాధి కల్పనను కూడా పెంచుతుందన్నారు. గత దశాబ్ద కాలంలో భారతదేశంలో విమానాశ్రయాల సంఖ్య రెండిరతలు పెరిగి 157కు చేరుకుందన్నారు, రానున్న 20 ఏళ్లలో మరో 200 విమానాశ్రయాలను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి వెల్లడిరచారు. న్యూఢిల్లీలో ఎయిర్‌బస్ ఇండియా మరియు సౌత్ ఏషియా హెడ్‌క్వార్టర్స్, ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించిన సందర్భంగా నాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు. విమానాశ్రయ పర్యావరణ వ్యవస్థను విస్తరించడం ప్రాముఖ్యతను ఆయన గుర్తు చేశారు. ఇది ఉద్యోగ అవకాశాలు, వాణిజ్య వృద్ధి రెండిరటినీ ప్రేరేపిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. సివిల్ ఏవియేషన్ సెక్రటరీ వుమ్లున్‌మాంగ్ వుల్నామ్ కూడా విమాన ప్రయాణంలో గణనీయమైన పెరుగుదల నమోదు అయ్యిందన్నారు. గత ఏడాది నమోదైన ప్రస్తుత 220 మిలియన్ల నుండి వచ్చే ఐదేళ్లలో ప్రయాణీకుల రద్దీ రెట్టింపు అవుతుందని పేర్కొన్నారు.

# క్రిప్టోలతో ఆర్థిక స్థిరత్వానికి పెను ముప్పు



క్రిప్టో కరెన్సీపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగవర్నర్ శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తంచేశారు. క్రిప్టోలతో ఆర్థిక స్థిరత్వానికి పెను ముప్పు ఉందన్నారు. 'పీటర్సన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటరేషనల్ ఎకనామిక్స్' థింక్ ట్యాంక్‌కు హాజరైన ఆయన క్రిప్టోల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. క్రిప్టోలతో ద్రవ్య లభ్యత, ఆర్థిక స్థిరత్వానికి భారీ ప్రమాదం పొంచిఉందని దాస్ అన్నారు. దీనికారణంగా ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సరఫరాపై కేంద్ర బ్యాంక్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉందన్నారు. క్రిప్టోలు ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యాన్ని చెలాయించకూడదని తాను అభిప్రాయపడుతున్నట్లు చెప్పారు. అందుకే క్రిప్టోను ప్రమాదకరంగా భావిస్తున్నట్లు ఆయన వివరించారు. క్రిప్టోతో కలిగే భారీ నష్టాలను దృష్టిలోఉంచుకొని ఈ సమస్యపై అంతర్జాతీయ అవగాహన ఉండాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్‌లకు ఇది ప్రధాన ఆందోళన అని దాస్ తెలిపారు. క్రిప్టో కరెన్సీల గురించి ప్రశ్నల్ని లేవనెత్తిన మొదటి దేశం భారత్ అని దాస్ పేర్కొన్నారు. భారత్ అధ్యక్షతన జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో క్రిప్టోపై ఎలా వ్యవహరించాలనే అంశంపై అంతర్జాతీయ అవగాహనను పెంపొందించేందుకు ఒప్పందం జరిగిందని గుర్తుకుతెచ్చారు. క్రిప్టోపై ఆందోళన వ్యక్తంచేసిన మొదటి సెంట్రల్ బ్యాంకుల్లో తమ బ్యాంకు కూడా ఒకటన్నారు. ''ఆర్థికవ్యవస్థలో క్రిప్టో ఆధిపత్యం చెలాయిస్తే సెంట్రల్ బ్యాంక్ ద్రవ్య వ్యవస్థపై నియంత్రణ కోల్పోతుంది. ఇది ద్రవ్య వ్యవస్థలో అస్థిరతకు దారితీస్తుంది. అంతేకాదు ఆర్థికరంగంపై ప్రభావం చూపుతుంది'' అని ఆయన అన్నారు. అందుకే ఈవిషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

# సేల్స్‌లో బడ్జెట్ బైక్స్ సరికొత్త రికార్డు..

హీరో స్ప్లెండర్ బైక్‌కు వినియోగదారుల ఆదరణ లభించింది. సెప్టెంబర్ లో 26,318 యూనిట్లను ఆ కంపెనీ విక్రయించింది. గతంలో పోల్చితే 3.16 శాతం పెరిగింది.హీరో స్ప్లెండర్ 125 సీసీ బైక్ ధర రూ.75,441 నుంచి రూ.78,286 వరకూ ఉంది. హీరో ఎక్స్ ట్రీమ్ 125 బైక్ రూ.95 వేల నుంచి రూ.99,500 ధరలో అందుబాటులో ఉంది. సెప్టెంబర్ లో 37,520 ఎక్స్ ట్రీమ్ బైక్ యూనిట్లను కంపెనీ విక్రయించింది. అమ్మకాలలో హీరో ఎక్స్ ట్రీమ్ 125 బైక్ నాలుగో స్థానంలో నిలిచింది. హోండా కంపెనీ నుంచి విడుదలైన ఎస్పీ 125/ షైన్ 125 సీసీ మోటారు సైకిళ్లు సెప్టెంబర్ లో జరిగిన అమ్మకాలలో అగ్రస్థానంలో నిలిచాయి. హోండా ఎస్పీ, షైన్ మోటారు సైకిళ్ల యూనిట్లను ఆ కంపెనీ 1,53,476 విక్రయించింది. గతేడాదిలో పోల్చితే దాదాపు 13.40 శాతం ఎక్కువ. హోండా షైన్ రూ.81,251 నుంచి రూ.85,251 ధరకు, హోండ్ ఎస్పీ రూ.87,468 నుంచి రూ.91,468 ధరకు అందుబాటులో ఉన్నాయి.అమ్మకాలలో రెండో స్థానంలో బజాజ్ కంపెనీ బైక్ లు నిలిచాయి. పల్సర్ 125/ ఎన్ఎస్ 125 బైక్ ల అమ్మకాలు జోరుగా సాగాయి. ఆ కంపెనీ సెప్టెంబర్ నెలలో 67,256 యూనిట్లను విక్రయించింది. బజాజ్ పల్సర్ 125 రూ.92,883, ఎన్ ఎస్ 125 బైక్ రూ.1.01 లక్షలకు అందుబాటులో ఉంది. టీవీఎస్ నుంచి విడుదలైన రైడర్ బైక్ అమ్మకాలలో మూడో స్థానం సాధించింది. టీవీఎస్ రైడర్‌కు చెందిన 43,274 యూనిట్లను ఆ కంపెనీ విక్రయించింది. ఈ మోటారు సైకిల్ రూ.84,869 నుంచి రూ.1.04 లక్షల ధరలో అందుబాటులో ఉంది. అయితే గతేడాది 48,753 రైడర్ బైక్ అమ్ముడయ్యాయి. వాటితో పోల్చితే ఈ సారి తగ్గుముఖం పట్టినట్టే.



## అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం సందర్భంగా

కళాకారులకు జయహో
కళ మానసిక చైతన్యవిద్య
కళాకారులు
కలల అంతర్యాన్నివిప్పిచూపే విద్వాంసులు
మనసు మురికిని కడిగేసి
అనుభూతిస్నానంతోహృదయాన్ని అద్దంలా చేస్తరు చూపిస్తరు
మనసు జడత్వాన్ని వదిలించే మహానుభావులు కళాకారులు
కళాకారులు లేకపోతే
మనసు చైతన్యం మూగబోతది
భావరసంతో మురిపించిహృదయాన్ని అద్దంలా ఉంచుతరు
మనసు జడత్వాన్ని వదిలించే మహానుభావులు కళాకారులు
కళాకారులు లేకపోతే మనసు చైతన్యంమూగగబోతది
బుద్ధిజడత్వాన్ని వదిలించే మహానుభావులుకళాకారులు
భావరసంతో.మురిపించి
గానకళతో ఆకర్షించి వాయిద్యాలమోతతో
మనసును నిద్రలేపుతరు
మనసునడతను బుద్ధి చాతుర్యాన్ని
గానకళలో నిక్షిప్తంచేసి
బతుకు సౌందర్యానికి
పట్టాభిషేకం చేస్తరు
కళా కారులు స్వరవిద్వాంసులు
తమగళ స్వరాన్ని
బుద్ధిగళంలోనింపుతరు
కళాకారులకు జయహో జయహో


**జనార్ధన వల్ల భాపురం**
**9440163687**

## దీపిక

### తెలుసుకో

చెప్పగలమా రెండు కళ్ళలో ఏది కావాలంటే......
తేల్చగలమా రాత్రి పగలు ఏది కావాలో.......
కని, పెంచి, ప్రయోజకుడిని చేసినవారొకరు....
మన కోసమే, మనని నమ్మి, మనవెంట అందరినీ వదలి వచ్చినవారొకరు .... ...
కోరుట సాధ్యమా ఇద్దరిలో ఎవరు కావాలంటే....
ఉండలేదు ప్రాణం దేహాన్ని విడిచి.....
మనలేదు దేహం ప్రాణాన్ని వీడి.....
జీవితంలో మనుగడ సాధించాలంటే.....
జీవితాన్ని జీవితంగా అనుభవించాలంటే....
కావాలి తల్లి నీడ, కావాలి భార్య తోడు ....
వంశాన్ని కాపాడేదొకరు, వంశాంకురాన్నిచ్చేది ఒకరు....
సలహా ఇచ్చేది ఒకరు, దాని అమలులో చేయూతనిచ్చేది ఒకరు....
మగవాడి బ్రతుకు సవ్యంగా సాగాలన్నా, స్వర్గతుల్యం కావాలన్నా ఇద్దరూ అవసరమే
మగవానికి పంచ జ్ఞానేంద్రియాలు తల్లి, భార్య....
ఇది తెలుసుకుంటే జీవితం సుఖమయం, ఆనందనందనం....


జి. మధు మురళి
భీమారం
హన్మకొండ





## రైతన్న కలలపంట...

***************************





రైతన్న కలలపంట నీవు,
హృదిని చేరి అలరించే
భాగ్యము కానిదానవు నీవు.

దోపిడీ లోకాన్ని ప్రశ్నించలేవు,
ఆ'కలి' యుద్ధానికి తెరదించలేవు,
అందమైన తోటలో
ధాన్యలక్ష్మివై కనిపించేవు,
రైతింటి కలతల రాగానికి
పల్లవే అయ్యేవు,
మనసులోని ఆశలు తీర్చేటి దేవుడవై
ఎపుడు కనిపించేవు.

దళారుల స్వార్థానికి కొంగుబంగారమై
నిలిచేవు,
నీతులుచెప్పే నేతలకు
ఓట్లను బహుమతిగా ఇచ్చేవు
అందమైన జన్మనిచ్చిన రైతుజీవితంతో
ఆటలే ఆడేవు,
ఇష్టంగా ఆదరించే జనులకు
పరిహసించు ధరలతో దరిచేరేవు,
రైతుయింట శుభం పలుకు
మంగళతోరణమై
ఎపుడు కనిపించేవు.

రచన:
ముక్కా శ్రీనివాస్,
మిర్యాలగూడ.






# మృణాల్ ఠాకూర్ లక్కు బాగుంది

తెలుగు ఎంట్రీని సీతారామం రూపంలో ఘనంగా జరుపుకున్న హీరోయిన్ మృణాల్ ఠాకూర్ కి ఆ తర్వాత హాయ్ నాన్న కూడా విజయం సాధించడం ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది.ఇంకేం టాప్ లీగ్ లోకి వెళ్లిపోతుందనుకున్న టైంలో ది ఫ్యామిలీ స్టార్ ఇచ్చిన షాక్ మాములుగా కొట్టలేదు. దాని వల్లే కెరీర్ డౌన్ కాకపోయినా అవకాశాలు, మార్కెట్ మీద విజయ్ దేవరకొండ మూవీ ప్రభావం చూపించింది. నిజానికి కంగువలో సూర్య సరసన ముందు మృణాల్ నే అనుకున్నారట. అయితే డేట్ల విషయంలో వచ్చిన ఇబ్బంది వల్ల వదులుకోవాల్సి వస్తే ఆ ఛాన్స్ కాస్తా దిశా పటానిని వరించింది. తీరా చూస్తే కంగువలో తనుండేది చివరి ఇరవై నిముషాలు మాత్రమే అని తేలడంలో ఒకరకంగా మృణాల్ ఠాకూర్ నష్టపోయింది పెద్దగా లేదనే చెప్పాలి. అలాని సూర్యకు జోడి అయ్యే అవకాశం మిస్ కాలేదు. ఆర్జె బాలాజీ దర్శకత్వంలో సూర్య చేయబోయే ఫాంటసీ థ్రిల్లర్ లో మృణాల్ నే ఎంపిక చేసినట్టు లేటెస్ట్ అప్డేట్. ఇంకా అధికారిక ప్రకటన ఇవ్వలేదు కానీ త్వరలోనే అనౌన్స్ చేయొచ్చు. ప్రస్తుతం కంగువ ప్రమోషన్లలో బిజీగా ఉన్న సూర్య దీని థియేటర్ రన్ అయ్యాక కొత్త సినిమాల అప్డేట్స్ ఇవ్వాలని నిర్ణయించుకోవడంతో అభిమానులు ఇంకో నెల రోజులు ఆగాల్సి ఉంటుంది. ఇక తెలుగులో చూస్తే మృణాల్ కొత్తగా సైన్ చేసిన ప్రాజెక్టులు లేవు. హిందీలో మాత్రం చెప్పుకోదగ్గ బిజీగానే ఉంది. పూజా మేరీ జాన్, హై జవానీతో ఇష్క్ హోనా హై, సన్ ఆఫ్ సర్దార్ 2, తుమ్ ఓ హో వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి.

# ఆ విషయంలో ఒత్తిడి లేదు..

హీరోయిన్‌గా అలరిస్తూనే నిర్మాతగానూ విజయం సాధించారు నటి కృతి సనన్. 'దో పత్తి' అనే చిత్రాన్ని నిర్మించి నిర్మాతగా తొలి హిట్‌ను అందుకున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. హీరోయిన్స్ కాస్మొటిక్ సర్జరీలు చేయించుకోవడంపై తన అభిప్రాయాన్ని తెలియజేశారు. 'మహిళలు ఎప్పుడూ అందంగా కనిపించాలని వారిపై ఒత్తిడి తీసుకురాకూడదు. అందంగా కనిపించడం కోసం శరీరభాగాలకు సర్జరీలు చేయించుకొనే వారి విషయంలో నేను తీర్పు ఇవ్వలేను. అది పూర్తిగా వారి సొంత నిర్ణయం. శరీరంలో ఒక భాగంలో మార్పు వచ్చినంతమాత్రాన అందంగా కనిపిస్తామన్న నమ్మకం మీకు ఉంటే ఏమైనా చేయించుకోవచ్చు. మీరు తీసుకున్న నిర్ణయం వల్ల వచ్చే సమస్యలను కూడా మీరే ఎదుర్కోవాల్సి ఉంటుంది. మీ జీవితం, మీ ముఖం, నేను అలాంటి విషయాల్లో సలహాలు ఇవ్వను. నేను అందం విషయంలో ఎప్పుడూ ఒత్తిడికి గురికాలేదు. మానసికంగా ఆనందంగా ఉంటే అదే మన ముఖంలో కనిపిస్తుంది. అందుకే ఎప్పుడూ ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నిస్తా. నేను తీసుకునే ఫొటోలకు కూడా ఫిల్టర్లు ఉపయోగించను' అని చెప్పారు. కృతి సనన్ ప్రధాన పాత్రలో నటించి నిర్మించిన 'దో పత్తి' తాజాగా నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలై మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో కృతి ద్విపాత్రాభినయంలో కనిపించారు. శశాంక చతుర్వేది దర్శకత్వం వహించారు. కవలలైన అక్కా చెల్లెళ్ల గురించిన రహస్యాలను వెలికితీసే పోలీసు అధికారి పాత్రలో కాజోల్ నటించారు. 'బ్లూ బటర్ ఫ్లై ఫిల్మ్స్' పతాకంపై కృతి నిర్మించిన తొలి చిత్రమిది. షహీర్‌షేక్, తన్వీ అజ్మీ, బ్రిజేంద్ర కాలా కీలకపాత్రలు పోషించారు.

# సూర్య చెప్పిన 'బ్యాంకు లోన్' కథ



తమిళంలో టాప్ స్టార్లలో ఒకడు సూర్య. తెలుగులో కూడా ఆయనకు మంచి ఫాలోయింగ్, మార్కెట్ ఉన్నాయి. సూర్య తండ్రి శివకుమార్ కూడా నటుడే అయినా ఆయనది చిన్న స్థాయే. ఇలాంటి బ్యాగ్రౌండ్ నుంచి వచ్చి చాలా పెద్ద రేంజికి వెళ్లాడు సూర్య. అన్న బాటలో నటనలోకి అడుగు పెట్టిన కార్తి సైతం స్టార్‌గా ఎదిగాడు. ఐతే సూర్య సినిమాల్లోకి అడుగు పెట్టే సమయానికి ఆయన కుటుంబానిది సాధారణ జీవనమే. సూర్య వల్లే ఆర్థికంగానే కాక అన్ని రకాలుగా ఆ కుటుంబం స్థాయి పెరిగింది.ఐతే తాను నటుడిగా స్థిరపడిపోవాలని, హీరోగా ఎదిగిపోవాలని సినిమాల్లోకి రాలేదని అంటున్నాడు సూర్య. తన తల్లి తండ్రికి తెలియకుండా తీసుకున్న బ్యాంక్ లోన్ తీర్చాలన్న లక్ష్యంతోనే తాను సినిమాల్లోకి వచ్చినట్లు సూర్య తాజాగా ఆసక్తికర విషయం వెల్లడిరచాడు. ''నేను చదువు ముగించిన వెంటనే ఓ గార్మెంట్స్ కంపెనీలో ఉద్యోగంలో చేరాను. మొదట 15 రోజులకు 750 రూపాయలు జీతంగా ఇచ్చారు. మూడేళ్ల తర్వాత నా జీతం 8 వేలకు పెరిగింది. ఒక రోజు నేను సొంతంగా కంపెనీ పెట్టాలని అనుకున్నా. కానీ నాన్న బాటలో ఇండస్ట్రీలోకి రావాలని మాత్రం అనుకోలేదు. ఐతే ఆ సమయంలో నాన్నకు తెలియకుండా అమ్మ 25 వేల రూపాయల బ్యాంక్ లోన్ తీసుకున్నట్లు నాకు చెప్పింది. ఆ లోన్ ఎలా తీర్చాలా అనుకుంటున్నపుడు ఓ సినిమాలో అవకాశం వచ్చింది.